www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

5

పశ్చిమ గోదావరి

లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ సిఐటియు ఆందోళన

ఆకివీడు: కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని, కార్మిక చట్టాలనే పటిష్టంగా అమలు చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు విమర్శించారు. లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక దుంపగడప రోడ్డులోని రైస్‌మిల్లు కూడలి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడారు. కార్మికుల కొద్దిపాటి హక్కులను హరించడానికే లేబర్ కోడ్‌లను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. కార్మికుల ప్రాథమిక హక్కులను హరించే కేంద్ర ప్రభుత్వ దూకుడుకు కళ్లెం వేసేలా కార్మిక వర్గం పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బొర్రా శ్రీను, బొర్రా సత్యం, బడుగు సాంబయ్య, యర్రా శ్రీను, కొట్టు వినాయక, బడుగు కొండ, పప్పల సింహాచలం, పైలి శ్రీను, బురాడ శ్రీధర్, నిమ్మల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా పిడిఎఫ్ అభ్యర్థి

డి.వి.రాఘవులు నామినేషన్

పాల్గొన్న పిడిఎఫ్ ఎంఎల్‌సిలు లక్ష్మణరావు, ఐవి, గోపీమూర్తి

ఏలూరులో ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాల భారీ ర్యాలీ

ఏలూరు నగరంలో పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు నామినేషన్ సందర్భంగా ర్యాలీ

నామినేషన్ అనంతరం సభలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్, సిటీ

ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు బలపర్చిన పిడిఎఫ్ అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులు (డివి.రాఘవులు) నామినేషన్ కార్యక్రమం భారీ ర్యాలీతో అట్టహాసంగా సాగింది. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్ నుండి వందలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు, కార్మిక, ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలొచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుండి ఫైర్ స్టేషన్ మీదుగా కలెక్టరేట్ వరకు గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్విికి అభ్యర్థి డివి.రాఘవులు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం సిఐటియు కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ బహిరంగ సభకు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి అధ్యక్షత వహించి మాట్లాడుతూ 2007 నుంచి పిడిఎఫ్ అభ్యర్థులుగా గెలుపొందిన వారు నీతి, నిజాయతీకి నిదర్శనంగా నిలిచారన్నారు. ముఖ్యఅతిథి శాసనమండలిలో పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్, కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే శక్తి పిడిఎఫ్ అభ్యర్థులకు మాత్రమే ఉందన్నారు. స్వలాభం కోసం కాకుండా ప్రజా సంక్షేమం కోసం పాటుపడే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. డివి.రాఘవులు 40 సంవత్సరాలుగా యుటిఎఫ్‌లో వివిధ స్థాయిల్లో పని చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఎన్నికకు కేవలం 20 రోజుల సమయం మాత్రమే ఉందని, ఈ 20 రోజులు 24 గంటలు పని చేయాలని కోరారు. కూటమి అభ్యర్థికి రాజకీయ, కుల, ధన, బలాలు ఉన్నాయని, మన పిడిఎఫ్ అభ్యర్థికి ప్రజాబలం, కార్యకర్తల బలం, సంఘాల బలం ఉందని తెలిపారు. సోషల్ మీడియాను ఉపయోగించుకుని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్విికి నామినేషన్ పత్రాలు అందిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై అడిగేవారే లేరని, ఈ పరిస్థితుల్లో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సిఐటియు ఎటువంటి ఉద్యమం చేసినా రాజకీయాలతో సంబంధం లేకుండా పిడిఎఫ్ ఎంఎల్‌సిలు సహకరించేవారని గుర్తు చేశారు. ప్రజాసంఘాల రాష్ట్ర నేతలు మంతెన సీతారాం, బి.బలరాం మాట్లాడుతూ శాసనమండలి ఎన్నికలు అంటే అంటే ఓటర్లు పిడిఎఫ్ అభ్యర్థులకే ఓట్లు వేస్తారని, ప్రస్తుతం ఆ సీటు కోసం సంబంధం లేని వారు పోటీ చేస్తున్నారని, రాజ్యాంగం మనకు కల్పించిన హక్కుని రాజకీయ పార్టీలవారు

సభలో మాట్లాడుతున్న గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, బి.గోపీమూర్తి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ప్రజాసంఘం నేత మంతెన సీతారాం

డివి.రాఘవులు విజయం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి పాలకులు ప్రజల జీవితాలు ఫణంగా పెట్టి కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన చట్టాలు చేస్తున్నారని విమర్శించారు. పాలకుల తప్పుడు విధానాలను ప్రశ్నించి ప్రజా సమస్యలను లేవనెత్తి పరిష్కారం కోసం కృషి చేసే రాఘవులును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. శాసనసభలో లాక్కోవాలని చూస్తున్నారని అన్నారు. దీన్ని తిప్పికొట్టి పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్, సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు కె.ఉమామహేశ్వరరావు, పి.చంద్రశేఖర్, ఎస్.బాలాజీ, జ్యోతిబసు, శ్రీదేవి, అరుణకుమారి, రవికుమార్, ముస్తఫా ఆలీ, విజయరామరాజు, రామభద్రం, జయకర్, షరీఫ్, నరేష్, డిఎస్‌విడి.ప్రసాద్, ఎ.రవి, ఎస్ఎన్.రమేష్, జి.రవికిషోర్, బేబీరాణి, జెఎన్‌వి.గోపాలన్, అరుణ్‌కుమార్, ఐవి.సుధాకర్, కె.రాజారామ్మోహన్‌రాయ్, ఆర్.లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ ఆవశ్యకతను వివరించి, ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రయాణాలు చేసేలా చూడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ కోరారు. గురువారం స్థానిక కొత్త బస్టాండ్ ఎన్‌జెజిఎం హైస్కూల్ వద్ద 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో హెల్మెట్ ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. హెల్మెట్లు ధరించి కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ ద్విచక్ర వాహనాలను స్వయంగా నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. జువ్వలపాలెం రోడ్డు శ్రీ అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యానికి చేరాలని, ఇంటి దగ్గర మీకోసం తల్లిదండ్రులు, భార్య, పిల్లలు ఎదురు చూస్తారని హితవు పలికారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే మరణాలు మొత్తం ప్రమాదాల్లో 70 శాతం ఉంటున్నాయని తెలిపారు. హెల్మెట్ ధరించడాన్ని తలకు భారంగా భావించొద్దని, రోజూ జరుగుతున్న ప్రమాదాలను ఒకసారి పరిశీలించి తప్పక హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని అన్నారు. జిల్లాలో మోటార్ సైకిల్‌పై ముగ్గురు ప్రయాణిస్తున్నారని, ఇది చాలా బాధాకరమని అన్నారు. మోటారు వాహన చట్టం 129 సెక్షన్ ప్రకారం ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వాహనచోదకుల వివరాలను తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వారిని మొదటిసారి హెచ్చరికతో వదిలి హెల్మెట్ ఆవశ్యకతను వివరించాలని, రెండోసారి హెల్మెట్ లేకుండా

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రయాణిస్తే కచ్చితంగా మోటారు వాహన చట్టం 177 సెక్షన్ ప్రకారం రూ.వెయ్యికిపైగా అపరాధ రుసుం విధిస్తారని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ మాట్లాడుతూ 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో జనవరి 16వ తేదీ నుండి జిల్లాలో ప్రతిరోజూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం మంచి శుభ పరిణామని అన్నారు. ఈ అవగాహనా కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరిలో ఆలోచన కలగాలని, వాహనం కొనుగోలు చేసినప్పుడే హెల్మెట్ కూడా తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ఇద్దరితోనే ప్రయాణాలు చేయాలని, నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టులు, మద్యం సేవించకుండా నడిపి, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే మరణాల శాతం చాలావరకు తగ్గుముఖం పడుతుందని జిల్లా ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు, జిల్లా రవాణా శాఖాధికారి టి.ఉమామహేశ్వరరావు, డిఎస్‌పి ఆర్‌జి.జయసూర్య, ఎంవిఐలు కెవిఎన్.ప్రసాద్, సిహెచ్‌వి.రమణ, ఎం.రవికుమార్, ఎన్ఎల్ఎస్.లక్ష్మి, డి.సత్యవాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డిఇఇ దానం, విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, స్వచ్ఛంద సేవకులు అల్ల శ్రీనివాసు, ఆటో యూనియన్ ప్రెసిడెంటు ఇంటి సత్యనారాయణ, వివిధ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎంఎల్‌సి స్థానానికి రెండు నామినేషన్లు

ఐదుకు చేరిన నామినేషన్లు సంఖ్య

శని, ఆదివారాలు సెలవు దినాలు

మరో రెండు రోజులు మాత్రమే మిగిలిన గడువు

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి గురువారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు కలెక్టరేట్‌లో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు, కాకినాడకు చెందిన ఇండిపెండెంట్ అభ్యర్థి కాట్రు నాగబాబులు ఒకొక్కరు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. పిడిఎఫ్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అభ్యర్థులతో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. దీంతో నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన ఈ నెల మూడో తేదీ నుంచి ఇప్పటి వరకు మొత్తం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఎన్నికల విభాగం తహశీల్దార్ చల్లన్నదొర తదితరులు పాల్గొన్నారు.

శని, ఆదివారాల్లో నామినేషన్ల స్వీకరణ ఉండదు

ఈ నెల మూడో తేదీ నుంచి పదో తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌లో పేర్కొంది. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు రావడంతో ఈ రెండు రోజులు నామినేషన్ల స్వీకరణ ఉండదని పేర్కొంది. దీంతో ఏడో తేదీ శుక్రవారం, ఆఖరి రోజు పదోతేదీ సోమవారం రెండు రోజులు మాత్రమే నామినేషన్లకు గడువు మిగిలి ఉంది. టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పదో తేదీన నామినేషన్ వేయనున్నట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

రుణాల మంజూరులో సొసైటీలు సహకరించాలి : కలెక్టర్

భీమవరం: జిల్లాలో సన్న, చిన్నకారు, కౌలురైతులకు రుణాల మంజూరులో సహకార సంఘాలు (సొసైటీలు) సహకరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాలో సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు సంబంధిత శాఖలు వారి భవిష్యత్ కార్యాచరణతో పూర్తిస్థాయి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో 19 శాఖల అధికారులతో నాలుగో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు జిల్లాలో సహకార సంఘాల నిర్వహణను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో 688 సహకార సంఘాలు ఉన్నాయని, వాటిలో 667 సంఘాలు పని చేస్తున్నాయని, వీటిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి (పిఎసిఎస్) సంఘాలు 122 ఉన్నాయని తెలిపారు. వీటిలో 121 సంఘాల కంప్యూటరీకరణ తుదిదశలో ఉందని, ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేస్తామని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ 2025-26 ఏడాదిని యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కో-ఆపరేటివ్స్‌గా ప్రకటిస్తూ, కోఆపరేటివిస్ బిల్ట్ ఎ బెటర్ వరల్డ్ అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. ఆ క్రమంలో ఆర్థిక బలోపేతం దిశగా విజన్-2047ను అనుసరించి అనుకూలత కలిగిన కార్యకలాపాలపై ప్రతిపాదనలు చేయాల్సి ఉందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపరచడానికి రుణాలు మంజూరు చేయడం ద్వారా కౌలు, పాడి రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు అమలు చేస్తున్న పథకాల పురోగతి, జిల్లా యంత్రాంగం తరపున చేపట్టిన కార్యక్రమం వివరాల నివేదిక అందజేయాలన్నారు. కార్యక్రమంలో డిసిసిబి జనరల్ మేనేజర్ ఎ.మాధవి, జిల్లా సహకార అధికారి ఎం.నాగరాజు, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డిఎస్‌ఒ ఎన్.సరోజ, డిపిఒ బి.అరుణశ్రీ, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, జిల్లా మత్స్య శాఖాధికారి ఆర్‌విఎన్‌వి.ప్రసాద్, మార్కెటింగ్ సహాయ ఇంజినీర్ ఎం.శ్రీనివాస్, సహాయ రిజిస్ట్రార్ టిఎస్‌విఎస్.హనుమంతరావు పాల్గొన్నారు.

నేడు ఎస్ఎఫ్ఐ 46వ జిల్లా మహాసభ

భీమవరం: ఎస్ఎఫ్ఐ 46వ జిల్లా మహాసభను పట్టణంలోని సిఎస్ఎన్ కళాశాలలో ఈ నెల ఏడో తేదీ శుక్రవారంనాడు నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ విద్యారంగంలోని సమస్యల పరిష్కారం కోసం, భవిష్యత్తు పోరాటానికి ప్రణాళిక సిద్ధం చేసేందుకు ఈ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్రంలో మూడోసారి అధికారంలో వచ్చిన బిజెపి ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేసేందుకు నూతన జాతీయ విద్యా విధానం పేరుతో దేశవ్యాప్తంగా విద్యను కాషాయీకరణ, ప్రయివేటీకరణ చేస్తుందన్నారు. అన్ని సెంట్రల్ యూనివర్సిటీల్లో ఆర్ఎస్ఎస్ భావజాలం గలవారిని నియమిస్తున్నారన్నారు. ఇది సరైన విధానం కాదన్నారు. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్య హక్కులను కేంద్రంలోని బిజెపి కాలరాస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడు నెలలవుతున్నా పాఠశాల విద్యార్థులకు తల్లికి వందనం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు విద్య అభ్యసిస్తున్న సంక్షేమ హాస్టల్లో దాదాపు 6, 7 నెలల నుంచి మెస్ కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయలేదని విమర్శించారు. ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు నెలకు రూ.మూడు వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎస్.లక్ష్మణ్, కార్యదర్శి బి.గణేష్, ఉపాధ్యక్షులు చిన్నం శాంతి, డి.సింధు పాల్గొన్నారు.

'ఇళ్ల' బకాయిలు ఇచ్చేదెప్పుడు..!

2014-19 మధ్య టిడిపి పాలనలో బకాయిలు పెండింగ్

ఏలూరు జిల్లాలో రూ.40.90 కోట్లు, 'పశ్చిమ'లో రూ.40.75 కోట్ల బకాయిలు పెండింగ్

గత వైసిపి ప్రభుత్వంలో లబ్ధిదారులకు తీరని అన్యాయం

సర్వే చేసి లెక్కలు తేల్చిన అధికారులు.. సొమ్ము జమలో మాత్రం తాత్సారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రభుత్వ సాయంతో ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. 2014-19 మధ్య ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల దుస్థితే అందుకు ప్రత్యక్ష నిదర్శనం. దాదాపు ఆరేళ్లు గడిచినా ఇప్పటికీ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వ సాయం అందని పరిస్థితి. 2014-19 మధ్య టిడిపి పాలనలో మొదటి మూడేళ్లు ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం చేపట్టలేదు. దీంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకంలో ఏలూరు జిల్లాలో దాదాపు 26,840, పశ్చిమగోదావరి జిల్లాలో 25,855 ఇళ్లను మంజూరు చేసింది. సొంతింటి కల నెరవేర్చుకునేందుకు లబ్ధిదారులు ఉన్న చిన్నపాటి ఇంటిని తొలగించుకుని ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు ఇస్తామని అప్పట్లో ప్రభుత్వం చెప్పింది. ఈ సొమ్ము రూ.లక్షన్నర కేంద్ర ప్రభుత్వం, రూ.లక్ష రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. కొంతమంది లబ్ధిదారులకు మొదటి విడత, మరికొంతమందికి రెండోవితగా కొంత సొమ్ము జమ చేయడం తప్ప పూర్తిస్థాయిలో జమ కాలేదు. చాలామందికి అసలు రూపాయి కూడా ప్రభుత్వ సాయం జమ కాలేదు. 2019 ఎన్నికల ముందు ఇళ్లకు సంబంధించిన సొమ్ము విడుదల చేస్తామని అప్పట్లో టిడిపి ప్రభుత్వం చెప్పినా చేయలేదు. 2019 ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల్లో టిడిపి ఓడిపోయింది. అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఇళ్ల నిర్మించుకున్న లబ్ధిదారుల గురించి పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో బకాయిలిస్తామని చెప్పినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు తీవ్ర కష్ట, నష్టాలను ఎదుర్కొన్న పరిస్థితి. ఇళ్ల నిర్మాణం కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి తీవ్ర కష్టాలను చవిచూశారు.

బకాయిల విడుదలలో తాత్సారం

2024 మేలో జరిగిన సాధారణ ఎన్నికల్లో టిడిపి కూటమి అఖండ విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వంలో ఇళ్లు నిర్మించుకుని ప్రభుత్వ సాయం అందని లబ్ధిదారులకు బకాయిలు అందిస్తామని ప్రకటించింది. అప్పట్లో ఇళ్లు నిర్మించుకుని బకాయిలు అందని లబ్ధిదారుల జాబితాను తయారు చేయాలని గృహనిర్మాణ శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. సర్వే చేసిన అధికారులు అప్పట్లో ఏలూరు జిల్లా పరిధిలో 26,840 మంది లబ్ధిదారులకు రూ.40.90 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 25,855 మంది లబ్ధిదారులకు రూ.40.75 లక్షలు బకాయి ఉన్నట్లు తేల్చారు. సర్వే పూర్తయ్యి రోజులు గడిచిపోతున్నా బకాయిల సొమ్ము మాత్రం ప్రభుత్వం విడుదల చేయడం లేదు. అదిగో.. ఇదిగో అంటూ కాలక్షేపం చేస్తోంది. లబ్ధిదారులంతా బకాయి సొమ్ము కోసం గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

తమ్ముడిని కడతేర్చిన అన్న

కుటుంబ, ఆస్తి వివాదాలే కారణం

కాళ్ల: పెదఅమిరంలో తమ్ముడిని అన్న హత్య చేసిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కొద్ది రోజులుగా కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాల నేపథ్యంలో అన్నదమ్ముల మధ్య చోటుచేసుకుంటున్న గొడవలు తీవ్రమై ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణ హత్యకు దారితీసింది. దీనికి సంబంధించి కాళ్ల పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇలవల వరలక్ష్మి తన భర్త రమేష్‌తో మనస్పర్థల కారణంగా సుమారు మూడేళ్లుగా పుట్టింటి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో అన్నదమ్ములైన ఇలవల సత్యనారాయణ, రమేష్ మధ్య తమ తల్లికి చెందిన ఒక సెంటు స్థలం కోసం వివాదాలు జరుగుతున్నాయి. 2023లో ఇరువురు ఘర్షణ పడి పోలీసు స్టేషన్‌లో కేసుల వరకూ వెళ్లింది. తర్వాత కోర్టులో రాజీ పడ్డారు. అయినా స్థలం కోసం గొడవలు పడుతూ ఉండేవారు. ఈ నెల ఐదో తేదీ రాత్రి సమయంలో ఇలవల రమేష్ తన అన్నయ్య సత్యనారాయణ ఇంటికి వెళ్లి కేకలు వేశాడు. దీంతో కోపోద్రిక్తుడైన సత్యనారాయణ రమేష్ తలపై కర్రతో బలంగా కొట్టాడు. దీంతో ఆయన అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు హుటాహుటీన రమేష్‌ను భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో పరిస్థితి విషమించి రమేష్ మృతి చెందాడు. మృతుని భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాళ్ల ఎస్ఐ ఎన్.శ్రీనివాస్ గురువారం కేసు నమోదు చేశారు

ఆ రెవెన్యూ అధికారులు తీరే వేరు..!

బంకు ఏర్పాటుకు చూపింది 24 సెంట్లు.. కాగితాల్లో ఉన్నది 29 సెంట్లు

ఐదు సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని కలిపేసేందుకు యత్నం!

ప్రజాశక్తి - భీమవరం

పాలకోడేరు రెవెన్యూ అధికారుల తీరు వివాదాస్పదంగా మారిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఒక పెట్రోల్ బంకు ఏర్పాటుకు ఎన్ఒసి (నో అబ్జెక్షన్)కి ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తూ నివేదిక రూపొందించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపించే లోపు 'ప్రభుత్వ భూమికి పంగనామం' శీర్షికన ప్రజాశక్తి కథనం ప్రచురించింది. దీనిపై భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి స్పందించారు. పెట్రోల్ బంకు ఏర్పాటుపై నివేదికను అందించాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. రెవెన్యూ, సర్వే అధికారులు బంక్‌కు సంబంధించిన స్థలాన్ని, ప్రభుత్వ భూమిని పరిశీలించారు. బంకు కేటాయింపునకు సంబంధించిన భూమిలో ప్రభుత్వ భూమి ఉందని గుర్తించారు. దీంతో చేసేదేమీ లేక ఎన్ఒసికి సంబంధించిన సిఫార్సును తిరగ రాశారు. తమది తప్పు లేదని నిరూపించుకోవడం కోసం తాపత్రయ పడ్డారు.

ప్లాన్ అప్రూవల్‌లో ఐదు సెంట్లు ప్రభుత్వ భూమి గుర్తింపు

పెట్రోల్ బంకు ఏర్పాటుకు 24 సెంట్లు స్థలాన్ని సంబంధిత వ్యక్తి ప్రతిపాదించారు. డాక్యుమెంట్ ప్రకారం అక్కడ 24 సెంట్లు భూమి ఉంది. వాస్తవానికి పెట్రోల్ బంకు ఏర్పాటుకు 30 మీటర్లు పొడవు, 30 మీటర్ల వెడల్పు ఉండాలి. 24 సెంట్లు స్థలంలో 30 మీటర్లు వెడల్పు ఉన్నప్పటికీ పొడవు మాత్రం 25 మీటర్లే ఉంది. దీంతో ప్లాన్ అప్రూవల్‌లో 24 సెంట్లకు బదులు 29 సెంట్లు భూమిని చూపారు. కనీసం రెవెన్యూ అధికారులు భూమిని సర్వే చేయకుండానే 24 సెంట్లకు ఎన్ఒసికి సిఫార్సు చేయడంపై అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ప్రజాశక్తి కథనంతో డొ

ప్రజాశక్తి
www.prajasakti.com

బాల్య వివాహాలపై అవగాహనుండాలి

ఆచంట: బాల్య వివాహాలపై యువతీ యువకులు అవగాహన కలిగి ఉండాలని పెనుమంట్ర సిడిపిఒ ఎ.కృష్ణకుమారి తెలిపారు. కొడమంచిలి చినపేట గ్రామంలో గర్భిణుల నమోదు, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాలు నిర్వహించారు. బాలికలు వివాహాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఏదైనా శక్తి లభిస్తుందన్నారు. ముఖ్యంగా ఆకు కూరలతో సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురికాకుండా ఉంటారని ఆమె సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌డి సూపర్‌వైజర్ సూర్యకుమారి, ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వలి సేవలు అభినందనీయం

నరసాపురం: టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు నివాసంలో గురువారం సంకు భాస్కర్‌నాయుడు, మల్లాడి మూర్తి, నండ్యాల బాబు, ఎమ్‌డి మౌలాలి ఫిబ్రవరికి సంబంధించి కొవ్వలి ఫౌండేషన్ ద్వారా నిత్యావసర సరుకులు పేద మహిళలకు అందజేశారు. అనంతరం భాస్కర్ నాయుడు మాట్లాడుతూ కొవ్వలి ఫౌండేషన్ స్థాపించిన దగ్గర నుంచి ఇప్పటి వరకూ ప్రతినెలా నిరుపేదలకు అవసరమైన నిత్యావసర సరుకులు, మందులు, అర్హులైన వారికి ఆపరేషన్లు గృహ నిర్మాణాలు చేయిస్తున్నట్లు తెలిపారు. నాయకులు కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడును అభినందిస్తూ ఆయన ఇలాంటి సేవా కార్యక్రమాలు అనేకం చేయాలన్నారు. కార్యక్రమంలో కొవ్వలి ఫాలోవర్స్, టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనలో పాల్గొనాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రం సిబ్బందికి గురువారం ఎలుకల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఏ మురళీకృష్ణ మాట్లాడుతూ ఎలుకల ముందు పెట్టడం వల్ల ప్రయోజనాలు, పెట్టే విధానం, నూకలు నూనె కలిపే విధానంపై ఆర్ఎస్‌కె సిబ్బందికి వివరించారు. అలాగే రైతులు కూడా నూనె, నూకలు తీసుకొని ఏడో తేదీ ఉదయం 9 గంటలకు పంచాయతీ కార్యాలయాల వద్ద ఎలుకల మందు పంపిణీ చేస్తారని తెలిపారు. దాన్ని తీసుకొని చేలో ఉన్న ఎలుక బొరియల్లో పెట్టాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడారు.కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పార్థసారథి, వెంకటరమణ పాల్గొన్నారు.

పెనుగొండ : సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంచాలకులు శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, ఆనంద కుమార్ చిన్నమల్లం గ్రామ పంచాయతీలో రైతులతో మాట్లాడఉ. ఎలుకల నివారణకు ఎర మందు వేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి పి.స్పందన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్.దయాకర్, కె.సంధ్య, సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

అందుబాటులో నులిపురుగు మాత్రలు

నరసాపురం: మున్సిపల్ కార్యాలయంలో గురువారం జాతీయ నులిపురుగుల నివారణపై కమిషనర్ ఎం.అంజయ్య మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోహన కారిచర్ల, పి.సోనియాతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో, అంగన్‌వాడీ సెంటర్‌లో నులిపురుగుల నివారణ మాత్రలు అందుబాటులో ఉంటాయన్నారు. స్కూల్ పిల్లలకు మధ్యాహ్నం భోజనం అయిన తరువాత వేయాలన్నారు. 2 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఫుల్ టాబ్లెట్ వేయాన్నారు. ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. అనంతరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నరసాపురం: మండలంలోని ఎల్‌బి.చర్లలోని అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియంలో బాలుర నుంచి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపల్ నల్లి సాయిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, ఇంటర్‌లో ఎంపిసి విభాగంలో 40, బైపిసిలో 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీ నుండి మార్చి 6వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థి ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, విద్యార్థి ఫొటో కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపల్ 99084 54667, వైస్ ప్రిన్సిపల్ 9490889741 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఇళ్లను ఖాళీ చేయం : నివాసితులు

ఆకివీడు: నగర పంచాయతీ పరిధిలోని శివారు గ్రామం ధర్మాపురంలో తాగునీటి చెరువు చుట్టూ నివసిస్తున్న, తమను వెంటనే ఖాళీ చేయాలంటూ అధికారులు చెప్పారని, తాము ఇళ్లను ఖాళీ చేయబోమని నివాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నగర పంచాయతీ అధికారులు నివాసితులకు చెప్పడంతో వారు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే తాము నెల రోజులు క్రితమే ఇళ్లు ఖాళీ చేయాలని తెలిపామని, సమయం అడిగినందువల్ల ఇంతకాలం ఆగామని అధికారుల వివరించారు. అయితే ఆ వార్డు కౌన్సిలర్ వైసిపి నాయకులు జాన్ వెస్లీ మాట్లాడుతూ చెరువుగట్టు చుట్టూ 33 మంది నివాసితులు ఉన్నారని, 26 మందికి మాత్రమే ఖాళీ చేయాలని చెప్పారని తెలిపారు. వారిలో 22 మందికి తమ ప్రభుత్వ హయాంలోనే కాలనీలో ప్రభుత్వ స్థలం, ఇళ్లు మంజూరు చేశామని, 16 మందికి నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మరో ఆరు పూర్తయ్యే దశలో ఉన్నాయన్నారు. ఐదుగురికి ప్రస్తుత ఎంఎల్ఎ ఇళ్ల స్థలాల కేటాయించారని చెప్పారు. చెరువుగట్టు ఖాళీ చేసేందుకు వారికి ప్రత్యామ్నాయం ఉందని, చెరువుగట్టు ఖాళీ అయితే కాలుష్యం తగ్గుతుందని తెలిపారు.

ఉపసర్పంచి ఫిర్యాదుపై విచారణ

నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి అందజేస్తాం : డిఎల్‌పిఒ

భీమవరం టౌన్: దిసుమర్రు గ్రామ సర్పంచి కోళ్ల బాలకృష్ణ, గ్రామ మాజీ కార్యదర్శి జి.కృష్ణమోహన్ అవినీతికి పాల్పడ్డారంటూ ఉప సర్పంచి అల్లూరి గంగాధర్ రాజు ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ బాలాజీ గురువారం విచారణ చేపట్టారు. ఈ విచారణకు బాలకృష్ణ, కృష్ణమోహన్ హాజరుకాగా, ఫిర్యాదుదారుడు ఫిర్యాదుల అంశాలతో కూడిన పత్రాలను డిఎల్‌పిఒకు అందజేసి వెళ్లిపోయారు. ఈ విషయమై సర్పంచి, మాజీ కార్యదర్శి రూ. 2 కోట్లకు అవినీతికి పాల్పడినట్లు పలుమార్లు ఉపసర్పంచి ఫిర్యాదు చేయడంతో ఇప్పటికే ఇఒపిఆర్‌డి ఒకసారి, డిఎల్‌పిఒ రెండు సార్లు విచారణ చేపట్టారు. దీంతోపాటు ప్రజా సమస్యల వేదికలో తెలియజేయడమే కాకుండా విచారణ పూర్తికాకుండానే ఇదే అంశాన్ని ఉపసర్పంచి కోర్టులో వేయడంతో జిల్లా యంత్రాంగం విచారణ వేగవంతం చేయాలని డిఎల్‌పిఒతోపాటు మరో ఆరుగురు బృందాన్ని విచారణకు పంపించింది. దీనిపై రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయి విచారణ చేపట్టి జిల్లా పంచాయతీ శాఖ అధికారికి నివేదిక ఇస్తామని డిఎల్‌పిఒ తెలిపారు.

ప్రతి పైసా బోర్డు సభ్యుల తీర్మానంతోనే ఖర్చు చేశాం : సర్పంచి కోళ్ల బాలకృష్ణ

ఉప సర్పంచి తమపై లేనిపోని అవినీతి ఆరోపణలు చేస్తున్నారని సర్పంచి కోళ్ల బాలకృష్ణ తెలిపారు. గ్రామ అభివృద్ధికి, పరిపాలనకు కావాల్సిన ప్రతిపైసా లెక్క చూపుతూ బోర్డు సమావేశాల్లో మెంబర్స్ అందరూ ఆమోదం పొంది తీర్మానం చేసిన తర్వాతే ఖర్చు చేశాం తప్ప ఎక్కడా అవినీతికి పాల్పడలేదన్నారు. ఏడాది వార్షిక ఆదాయం రూ 30 లక్షలు లేదని అలాంటిది రూ.రెండు కోట్లు ఎక్కడ అవినీతికి పాల్పడతామని తెలిపారు.

సాధారణ పరిపాలన అందించాం ..

మాజీ కార్యదర్శి కృష్ణమోహన్

తాను పంచాయతీ కార్యదర్శిగా చేసిన అన్ని రోజులూ పంచాయతీ బోర్డు సభ్యుల తీర్మానం మేరకు ఖర్చు చేయడం జరిగింది. బోర్డు తీర్మానాల్లో ఉపసర్పంచి కూడా సంతకం చేసి ఆమోదం తెలిపారు. అయితే అన్ని తాను చెప్పినట్లు ఎలా చేయగలమని, ఆయన తమపై లేనిపోని అవినీతి ఆరోపణలు చేస్తున్నారు.

ఎంఎల్‌సి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలి : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం: పట్టభద్రులు ఎక్కువ శాతం జనసేన వైపు చూస్తున్నారని, ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ప్రభుత్వ విప్ ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం జనసేన కార్యాలయం వద్ద జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి అధ్యక్షతన కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ, జనసేన నాయకులు అడబాల నారాయణమూర్తి, పెంటపాడు మండల అధ్యక్షులు పి.బాబి పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన

తాడేపల్లిగూడెం: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి వై.నూకరాజు గురువారం వెంకట్రామన్నగూడెంలో ప్రకతి వ్యవసాయ పద్ధతులతో కూరగాయలు సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన రైతు మరిడి నాగకృష్ణ పొలంలో సాగు చేస్తున్న దొండ, బొప్పాయి, అరటి, మునగ, బీర, బంతి వంటి ఉద్యాన పంటలను పరిశీలించారు. పంటలకు తెగుళ్లు సోకినట్లు గుర్తించి, వాటి నివారణకు జీవన ఎరువుల వాడకం గురించి రైతుకు వివరించారు. అనంతరం వెంకటరామన్నగూడెంలో రైతు సేవా కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రాన్ని నూకరాజు ప్రారంభించి రైతులతో మాట్లాడారు.

అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉల్లిపాయలు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) 39వ వార్షికోత్సవం ఉల్లిపాయలు మార్కెట్ జట్టు యూనియన్ ఆఫీసులో చల్లా చంద్రరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. యూనియన్ సీనియర్ నాయకులు దాస్యం అబ్రహం సిఐటియు జెండాను ఆవిష్కరించారు. 2024వ సంవత్సరం కార్యకలాపాల రిపోర్టును బంకురు నాగేశ్వరరావు ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు నివేదికను ఆమోదించారు. ఈ వార్షికోత్సవాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడారు. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికులను కట్టు బానిసలుగా మార్చడం కోసం యజమానులకు కార్మిక వర్గం శ్రమ శక్తిని దోచి పెట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యజమానులు కార్మిక చట్టాలు అమలు చేయకపోయినా, పిఎఫ్ సకాలంలో కట్టకపోయినా, వేతనాలు పెంచకపోయినా, వేతనాల్లో కోతలు పెట్టినా ఉండే శిక్షలను మోడీ ప్రభుత్వం పూర్తిగా రద్దు చేస్తుందన్నారు. హమాలీ చట్టం ఉన్న ముఠా, కలాసి జట్లకు ఎటువంటి ప్రయోజనం లేదని, ప్రమాదం జరిగితే పట్టించుకునే దిక్కేలేని విధంగా మోడీ ప్రభుత్వం ఉందని తెలిపారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా మనుధర్మ రాజ్యాంగానికి అనుకూలంగా పని చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ప్రయివేటీకరణ చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని లేనిపక్షంలో ఈ దేశంలో ఉన్న అన్ని కార్మిక, ఉద్యోగ సంఘాలను కలుపుకొని దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా సిరపరపు రంగారావు, అధ్యక్షులుగా చల్లా చంద్రరావు, వైస్ ప్రెసిడెంట్‌గా అల్లు సుబ్బారావు, కమాండర్‌గా బంకురు నాగేశ్వరరావు, సెక్రటరీగా కరక వెంకట్రావు, జాయింట్ సెక్రటరీగా సిరపు గణేష్, కమిటీ సభ్యులుగా బేత అప్పారావు, గంటా కోటి, సిరపు మహేష్, గొర్లి రమేష్, బర్ల బాలాజీ, దొర్లు సీతయ్య, సలుమూరి సత్యనారాయణ, చీర వెంకన్న, వెన్నెల చిన్న శ్రీను, మూడో కమాండర్‌గా కేతిరెడ్డి అప్పన్న ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, పెంటపాడు మండల నాయకులు చిర్ల పుల్లారెడ్డి, ప్రజా కళాకారులు షేక్‌వలీ, పోతు శ్రీను, ఇతర సంఘాల నాయకులు సత్తి కోదండ రామిరెడ్డి, నరమాల కృష్ణ, గొర్రెల సతీష్ కుమార్ పాల్గొన్నారు.

అంతర్వేది ఉత్సవాలకు పటిష్ట భద్రత : ఎస్‌పి

ప్రజాశక్తి - నరసాపురం

అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామివారి కళ్యాణ మహోత్సవానికి వెళ్లే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ అన్నారు. నరసాపురం, మాధవాయి పాలెం రేవు నుండి అంతర్వేదికి చేపడుతున్న ఏర్పాట్లను ఎస్‌పి పరిశీలించారు. నరసాపురం- సఖినేటిపల్లి గోదావరి రేవులో ప్రయాణికులను చేరవేసే పంటులో ఎస్‌పి అస్మీ, ఎఎస్‌పి వి.భీమారావు, డిఎస్‌పి జి.శ్రీవేదతో కలిసి ప్రయాణించారు. భద్రతా చర్యలు, ఏర్పాట్లపై వారు నిర్వాహకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పంటులో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. బాడీ వోర్న్ డ్రోన్, సోలార్ కెమెరాలు వంటి సాంకేతిక పరికరాలు ఉపయోగించి ఎటువంటి అవాంఛిత సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గజ ఈతగాళ్లు, పోలీస్ బందోబస్తు రేవుల్లో తిరునాళ్లు ముగిసే వరకూ విధుల్లో ఉండాలని ఆదేశించారు. నేరాలు, ప్రమాదాలు, అసాంఘిక కార్యక్రమాల నియంత్రణకు అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ఆయన వెంట సిఐలు బి.యాదగిరి, జి.దుర్గాప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సిఐ వి.పుల్లారావు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎయిర్ స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు డాక్టర్ వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం మహిళా సభ్యురాలు దుగ్గిన వెంకటలక్ష్మి భర్త దుగ్గిన నాగేశ్వరరావు జ్ఞాపకార్థం పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో 70 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మాట్లాడుతూ తల్లిదండ్రులను దైవంతో సమానంగా చూడాలని, వారి పట్ల నిర్లక్ష్య వైఖరి వహించొద్దని తెలిపారు. పేద వృద్ధులకు సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎయిర్ స్ట్రిప్ సభ్యులు వి.గజలక్ష్మి, సిహెచ్. జ్యోతి కుమారి, కె.కనకదుర్గ, కె.రామలక్ష్మి పాల్గొన్నారు.

ఆడ పిల్లలకు విద్య ఉపయోగకరం

పాలకొల్లు రూరల్: లంకలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్లో పాలకొల్లు సిడిపిఒ సిహెచ్ ఇందిర ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థినులచే సైకిల్ ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఆడపిల్లకు విద్య సమాజానికి మేలు కరంగా ఉంటుందని, అన్ని రంగాల్లోనూ రాణించి, తన కాళ్లపై తాను నిలబడటానికి దోహదపడుతుందని తెలిపారు. ఆడపిల్లను గర్భంలో ఉండగానే లింగ నిర్ధారణ చేసి భ్రూణ హత్యలు చేయడం నేరమన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజ్ ఇ. సత్యవేణి, హెచ్‌విబి.కమలమ్మ, ప్రధానోపాధ్యాయిని భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన

నరసాపురం: కృషి విజ్ఞాన కేంద్రం ఉండి కో ఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు, శాస్త్రవేత్త వినయ్ లక్ష్మీ తూర్పుతాళ్లలో సాగుచేస్తున్న వేరుశనగ పంటను పరిశీలించారు. ఆయనతోపాటు ఎడిఏ అనిల్‌కుమారి, ఎఇఒ లక్ష్మీనారాయణ, విహెచ్ఎ.జీవన్ హాజరయ్యారు. వేరుశనగ పంటలో తుప్పు, ఆకుమచ్చ తెగులును గమనించారు. పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు. వరి, వేరుశనగ వేసిన వారు తమ రైతు సేవా కేంద్రం పరిధిలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి, ఇ-పంట నమోదు, ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు.

వివి గిరిలో ఎన్‌జిపిటిఎల్ ఆన్‌లైన్ కోర్సులు

ఆకివీడు: తమ కళాశాలలో ఎన్‌పిటిఇఎల్ ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభించామని దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్లు ఆన్‌లైన్ ద్వారా తమ కళాశాలలోని విద్యార్థులకు, అధ్యాపలకు ఏకకాలంలో బోధిస్తారని తెలిపారు. ఈ సర్టిఫికెట్ కోర్సు 4, 8, 12 వారాల వ్యవధిలో నిర్వహించడం జరుగుతుదన్నారు. తమ డిగ్రీతోపాటు అదనంగా ఈ కోర్సులు చేసినట్లయితే వారికి మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. ఈ కోర్సుల ద్వారా విద్యార్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ జి.సంజీవరాజు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె.ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

నాలుగేళ్ల నుంచి అవమానాలు భరిస్తున్నా

సర్పంచి ఇంజేటి మరియమ్మ ఆవేదన

ప్రజాశక్తి - పాలకోడేరు

నాలుగేళ్ల నుంచి అనేక అవమానాలు భరిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని పాలకోడేరు సర్పంచి ఇంజేటి మరియమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో రూ.రెండు కోట్లు అవినీతి చేశామని నా భర్త లక్ష్మీపతిపై, నాపై అనేక ఆరోపణలు చేసి ప్రచారం చేయడమే కాకుండా అల్లరి పాలు చేశారని చెప్పారు. జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు జిల్లెల్ల సత్య సుదమా, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి కటిక దళ రాజారావు గురువారం సర్పంచి ఇంజేటి మరియమ్మ, భర్త లక్ష్మీపతిని పరామర్శించారు. ఈ సందర్భంగా సర్పంచి మరియమ్మ తాను పడుతున్న ఇబ్బందులను వారికి వివరించారు. ఉప సర్పంచి దెందుకూరి వెంకటరాజు, ఫిటర్‌గా పనిచేస్తున్న పెనుమత్స రామరాజు (కృష్ణ), వార్డు సభ్యుడు ఆళ్ల నాగేశ్వరరావుతో పాటు మరికొంతమంది వార్డు సభ్యులు తమపై లేనిపోని ఆరోపణలు చేసి అవినీతి చేశామని ప్రసారమాధ్యమ్లో పోస్టులు పెట్టేందుకు సహకరించి అల్లరి పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలో ఇప్పటికీ తనకు జీతభత్యాలు ఇవ్వలేదని, కార్యాలయానికి వస్తే కనీసం తాగునీరు ఇవ్వకపోవడమే కాకుండా సిబ్బంది అగౌరవంగా చూస్తున్నారని ఆందోళన చెందారు. పంచాయతీలో చేసిన పనులకు ఇప్పటికీ బిల్లులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు జిల్లెల్ల సత్య సుదామా మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన సర్పంచి మరియమ్మపై ఉప సర్పంచి వెంకటరాజు, రామరాజు, (కృష్ణ), వార్డు సభ్యులు నాగేశ్వరరావు అవమానకరంగా ప్రవర్తించడం అన్యాయమన్నారు. కనీసం సర్పంచి ఆదేశాలను కూడా పట్టించుకోకుండా గౌరవం లేకుండా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. సర్పంచి మరియమ్మ భర్త లక్ష్మీపతిపై ఉద్దేశ పూర్వకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి అల్లరి పాలు చేయడం సరికాదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని అవసరమైతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

వైసిపి మహిళా జిల్లా అధ్యక్షురాలుగా విజయలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలుగా కోడె విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి ఆదేశానుసారం పార్టీ కార్యాలయం నియామక పత్రం అందినట్లు ఆమె బుధవారం మీడియాకు వివరించారు. పార్టీ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే విజయలక్ష్మి భర్త కూడా యుగంధర్ వైసిపిలో సీనియర్ నాయకులుగా కొనసాగుతున్నారు.

డాక్యుమెంటు పోయినది

ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, వట్లూరు గ్రామము, డోర్ నెం. 10-72 కి చెందిన గుజ్జుల శౌరి, తండ్రి: (లేటు) గుజ్జుల ప్రకాశం అను నేను dt. 03-02-2025 వ తేదీన **డాక్యుమెంట్ నెం. 3350/2008** గల సవరణ దస్తావేజును తీసుకుని నేను సుమారు ఉదయం 11-00 గంటలకు నా ఇంటి వద్ద నుండి బండిపై ఏలూరు చాటపర్రు వెళ్తుండగా, చాటపర్రు సమీపములో చూసుకుంటే బండికి పెట్టిన కవర్ మరియు కవరులో ఉన్న సదరు సవరణ **దస్తావేజు నెం. 3350/2008** కనబడలేదు. ఎంత వెతికిన దొరకలేదు. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

గుజ్జుల శౌరి
S/o (లేటు) గుజ్జుల ప్రకాశం
డోర్ నెం. 10-72, వట్లూరు గ్రామము,
పెదపాడు మండలం, ఏలూరు జిల్లా
సెల్: 95152 72332

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, కైకరం గ్రామ కాపురస్తులైన కోసనం రత్నకుమారి భర్త: అర్జున్ అను నేను నా యొక్క పాస్‌పోర్టు గణపవరం SBI సెంటర్లో జిరాక్స్ తీయించుకొని మా బంధువులు ఇంటికి వచ్చే మార్గమధ్యలో **పాస్‌పోర్టు నెం. Y7698128** గల పాస్‌పోర్టు గల పాస్‌పోర్టు మరియు జిరాక్స్ తో సహా కవర్లో పెట్టుకుని మా బంధువులు ఇంటికి వచ్చే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు. ఎంత వెతికిన దొరకలేదు. దొరికినవారు ఈ క్రింది ఫోన్ నెంబర్ కు తెలియజేయగలరు.

కోసనం రత్నకుమారి
భర్త: అర్జున్
కైకరం గ్రామం,
ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా
సెల్: 93927 38984

మహారాజశ్రీ కృష్ణాజిల్లా మచిలీపట్నం 9వ అదనపు జిల్లాజడ్జి వారి కోర్టులో
A.S. No. 10/2024

బిట్వీన్ :
నట్ల సర్వారాయుడు & మరియొకరు ... అప్పెల్లెంట్స్
మరియు
అత్తిలి ఉమామహేశ్వరి @ ఉమ & అదర్స్ .... రెస్పాండెంట్స్

To, **రెస్పాండెంట్ 15 :**
R15) కొల్లాటి చంద్రకళ @ అమ్మాజి W/o. సత్యన్నారాయణ, R/o. డోర్ నెం.25-9-41/బి12, పెద్దేటి వారివీధి, కొప్పర్రి బిల్డింగ్స్, భీమవరం-534202.

పై నెంబరు అప్పీలులో 15వ రెస్పాండెంటు అయిన మీ హాజరు నిమిత్తం dt. 24-02-2025నకు వాయిదా అయియున్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం గం।। 10-30 ని।లకు పై కోర్టువారి యెదుట మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమున తదుపరి గ్రంథములు జరిపించ బడునని ఇందుమూలం గా తెలియజేయటమైనది.

(శ్రీ కోర్టువారి వుత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది: 24-02-2025
మచిలీపట్నం
dt.06-02-2025

Y.U.S.V.V. సుబ్బారావు
అప్పెల్లెంట్స్ తరపున న్యాయవాది
మచిలీపట్నం.

మహారాజశ్రీ ఏలూరు స్పెషల్ అడిషినల్ జ్యూడిషియల్ పస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఫర్ ఎక్సైజు ఏలూరు వారి కోర్టులో
I.A. No. 7/24 in O.S.No. 50/2024

Between: